సాక్షి గుంటూరు

శుక్రవారం । 3 । మార్చి । 2023



సజావుగా పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక గుంటూరు జిల్లాలో గురువారం 94.01 శాతం పంపిణీ పూర్తయింది. సాయంత్రానికి 2,38,058 మందికి రూ.65.40 కోట్ల నగదు అందజేశారు.



ఆర్టీసీ బస్సు బోల్తా

రేపల్లెరూరల్: అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా పడిన సంఘటన గురువారం రాత్రి మండలంలోని కారుమూరు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎవరికీ ప్రమాదం జరగలేదు.



ఉగాదికి నిర్మాణాలు పూర్తిచేయాలి

అద్దంకిరూరల్: గృహ నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తిచేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. గురువారం బొమ్మనంపాడు జగనన్నలే అవుట్‌ను పరిశీలించారు.

న్యూస్‌రీల్

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 21 సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ శాంతి విశాల గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లోని ఖాళీ సీట్లు, అభ్యర్థుల విద్యార్హతలు తదితర వివరాల కోసం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసంhttps://apgpcet.apcfss.in, https://apgpcet. apcfss.in/inter వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు.

నేడు జెడ్పీలో భేటీ కానున్న స్థాయీ సంఘాలు

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాలు శుక్రవారం భేటీ కానున్నాయి. మొత్తం ఏడు స్థాయీ సంఘాలకుగాను 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జెడ్పీలోని ఆమె ఛాంబర్‌లో జరగనున్నాయి. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. 3వ స్థాయీ సంఘానికి సంబంధించి వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, 5వ స్థాయీ సంఘం స్త్రీ–శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, 6వ స్థాయీ సంఘం సాంఘిక సంక్షేమంపై జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరగనున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలతో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కానున్నారు. స్థాయీ సంఘ సమావేశాలకు హాజరు కానున్న అధికారులు ఆయా శాఖల వారీగా ప్రగతితోపాటు గత సమావేశాల్లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలతో కూడిన సమగ్ర వివరాలతో హాజరు కావాలని జెడ్పీ సీఈవో జె.మోహనరావు కోరారు.

యార్డులో 1,06,842 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,01,900 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,06,842 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 81,642 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పోషకాహారం



బల్లికురవ: ప్రభుత్వం జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రతి రోజూ మంచి పౌష్టికాహారాన్ని అందిస్తుందని, ప్రతి విద్యార్థి భోజనం చేసేలా ఉపాధ్యాయులు అవగాహన పెంచాలని ఆర్జేడీ వీవీ సుబ్బారావు, బాపట్ల డీఈవో పీవీజే రామారావు ఆదేశించారు. గురువారం మండలంలోని వేమవరం, పాతమల్లాయపాలెం, నక్కబొక్కలపాడు పాఠశాలలను ఆర్జేడీ, డీఈఓలు వేర్వేరుగా తనిఖీ చేశారు. వేమవరంలో విద్యార్థులు రాసిన వర్క్‌బుక్‌లో లోపాలను సక్రమంగా చూడకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతమల్లాయపాలెంలో పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లపై అవగాహనతో విద్యార్థులకు బోధిస్తుండటంతో హెచ్‌ఎం ఎస్ ప్రభాకరరావు, ఉపాధ్యాయులను ఆర్జేడీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తనిఖీలో ఎంఈవో బీ.వీరరాఘవయ్య పాల్గొన్నారు.

గతి తప్పిన బాల్యం

- చిన్న వయసులోనే చెడు అలవాట్లు
- కుటుంబంలో నిరాదరణ
- ఇద్దరి చావుకు కారణమైన మైనర్లు
- వ్యక్తిత్వ లోపాలు ప్రధాన కారణమంటున్న మానసిక వైద్యులు
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- అసాంఘిక శక్తులపై పీడీయాక్ట్ పెడతాం: జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



వాచ్‌మన్‌పై దాడి చేస్తున్న మైనర్(ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: బాల్యం గతి తప్పుతోంది. మంచిగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థానాలకు వెళ్లాల్సిన వయస్సులో చెడు అలవాట్లకు లోనై తమ జీవితాలను నాశనం చేసుకోవడమే కాకుండా ఇతరుల జీవితాలను కూడా నాశనం చేస్తున్నారు. చెడు స్నేహితులు, ఇంట్లోని పరిస్థితులు వారిని మరింత పాతాళానికి నెట్టేస్తున్నాయి. గుంటూరు నగరంలో మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు మైనర్లు విచక్షణారహితంగా వ్యవహరించారు. ఇద్దరు వాచ్‌మెన్‌ల ప్రాణాలు తీయడంతోపాటు, కనపడిన వారందరిపై దాడి చేశారు. పలుషాపుల్లో చోరీకి పాల్పడటంతోపాటు ట్యాబ్‌లు, సెల్‌ఫోన్లు దొంగతనం చేశారు. ప్రశాంతంగా ఉండే గుంటూరు నగరంలో ఈ సంఘటనలు భయాందోళన కలిగించాయి. బతుకుతెరువు కోసం వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్న వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎన్నడూ లేని విధంగా గుంటూరు నగరంలో జరిగిన ఇలాంటి భయానక సంఘటనలు మళ్లీ చోటుచేసుకోకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాల్సి ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ లేకపోవడం, బిజీ జీవితంలో పడిపోయి పిల్లలు ఎలా ఉంటున్నారు, ఏం చేస్తున్నారనే విషయాలను తల్లిదండ్రులు గమనించకపోవడం, ప్రాశ్చాత్య పోకడలకు యువత అలవాటు పడడం, ఆర్థిక కారణాలు, చెడు వ్యసనాలకు బానిసలైపోవడం తదితర కారణాలతో యువత ఈ మధ్యకాలంలో హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి హింసాత్మక ధోరణి వల్ల సమాజం భయాందోళనకు గురవుతోంది. ఇలాంటి సంఘటనలు కట్టడి చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాల్సి ఉంది. మంగళవారం హత్యలకు పాల్పడిన మైనర్ల కుటుంబ నేపథ్యం కూడా ఇదేవిధంగా ఉండటం గమనార్హం. ఒక మైనర్ సోదరుడు కూడా చిన్నచిన్న దొంగతనాలు చేస్తుంటాడని సమాచారం. మరో మైనర్ దొంగతనాలు చేసి జువైనల్ హోంకి వెళ్లి వచ్చాడు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత కుటుంబసభ్యులు అతనిని దూరంగా ఉంచడంతో మరింత కసి పెంచుకుని చెడు వ్యసనాలకు బానిస అయినట్లు తెలుస్తోంది. యువతలో నేర ప్రవృత్తి ఈ మధ్య కాలంలో ఎక్కువైంది. వీరు కొంత మంది గ్రూపులుగా ఉండి నేరాలు చేయడం తరచూ జరుగుతోంది. ఒంటరిగా చేసే వారు కూడా ఉంటారు. యుక్త వయస్సులోనే నేరప్రవృత్తికి పాల్పడేవారు స్నేహితులతో కలిసి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడతారు. ఒంటరిగా నేరాలకు పాల్పడే వారిలో కొంత మానసిక సామాజిక పరిపక్వత ఉంటుంది. వీరిపై స్నేహితుల ప్రభావం ఉండదని మానసిక నిపుణులు చెబుతున్నారు. అయినా వీరు నేరాలకు పాల్పడడానికి కారణం వీరిలో భావోద్వేగాలపై నియంత్రణ లేకపోవడమే. వీరు సామాహిక ఒంటరితనానికి లోనై ఉంటారు.

వ్యక్తిత్వ లోపాలు ప్రధాన కారణం



పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం సరిగా ఉండకపోవడం, తల్లిదండ్రుల ఆదరణ లేకపోవడం, సంరక్షణ లోపించడం, పర్యవేక్షణ లేకపోవడంతోపాటు మానసిక రుగ్మతలు ప్రధాన కారణం. తల్లిదండ్రుల్లో మానసిక వ్యాధులు, నేరప్రవృత్తి ఉండటం, పేదరికం, చిన్నతనంలో క్రమశిక్షణ లేకపోవడం వల్ల కూడా ఇలా జరుగుతుంది. వీరిలో వస్తున్న మార్పులను చిన్నతనంలోనే గుర్తించి కుటుంబపరంగా, సామాజికపరంగా స్కూల్ పరంగా మల్టీసిస్టమ్యాటిక్ థెరపీ చేయాలి. కుటుంబానికి, వ్యక్తికి కౌన్సెలింగ్ చేయాలి. మానసిక రుగ్మతలుంటే ఔషధాలు వాడడం వలన ప్రయోజనం ఉంటుంది.

– డాక్టర్ ఇంటూరి శరత్‌చంద్ర, మానసిక వ్యాధి నిపుణులు, గుంటూరు

చెడు వ్యసనాల బారిన పడవద్దు



యువకులు చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి. నేర ప్రవృత్తి కలిగిన వారికి దూరంగా ఉండాలి. చిన్నవయస్సులోనే నేరాలకు పాల్పడటం వల్ల వారి భవిష్యత్ అంధకారంగా మారుతుంది. వారి చర్యల వల్ల వారి కుటుంబాలతో పాటు బాధిత కుటుంబాలు కూడా నష్టపోతాయి. అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై నిఘా పెట్టడంతో పాటు వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ కూడా అమలు చేస్తాం.

–ఆరిఫ్ హాఫీజ్, జిల్లా ఎస్పీ

సామూహిక నేరప్రవృత్తికి కారణాలు

- యువతలో వ్యక్తిపరంగా, స్నేహితులపరంగా, కుటుంబసభ్యుల మధ్య సంబంధాలు ప్రభావితం చేస్తాయి.
- స్నేహితుల గ్రూపులో ప్రాధాన్యత పొందడానికి వారి ఒత్తిడికి లోనవుతారు.
- చదువును అశ్రద్ధ చేసి విలాసాలకు అలవాటు పడడం
- మత్తు పదార్థాలకు అలవాటు పడడం

యువతలో కాండక్ట్ డిజార్డర్

- ఇతరులను కొట్టడం, దాడి చేయడం, రేప్ చేయడం వంటివి
- ఇతరుల హక్కులకు భంగం కలిగించడం
- దొంగతనాలు, దొమ్మీ, అబద్ధాలు, మోసం చేయడం తదితరాలు
- ఇంట్లో నుంచి, కాలేజీ, స్కూల్ నుంచి పారిపోవడం
- చెడు స్నేహాలు కలిగి ఉంటారు



● **ఆత్మీయ స్వాగతం**

విశాఖపట్నంలో రెండు రోజులపాటు జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్(జీఎస్ఐ)లో పాల్గొనేందుకు గురువారం సాయంత్రం అక్కడి ఎయిర్‌పోర్టుకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని. - సాక్షి ఫొటోగ్రాఫర్

జీబీసీ కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ప్రయాణికులు సురక్షితం



కాలువ నుంచి కారును బయటకు తీస్తున్న స్థానికులు

ముప్పాళ్ల: గుంటూరు బ్రాంచి కాలువలోకి కారు దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఇరువురు సురక్షితంగా బయటపడ్డారు.సంఘటన గురువారం తెల్లవారుజామున పలుదేవర్లపాడు సమీపంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. పలుదేవర్లపాడు గ్రామానికి చెందిన రూపెనగుంట్ల ఘన్‌సైదా, భార్య మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు రావాలంటూ సైదా భార్య ప్రకాశం జిల్లా కొమరోలు మండలం గంగ్రెడ్డిపల్లిలోని తమ్ముడు దూదేకుల నరసింహారావుకు కబురు చేసింది. ఆయన తన మిత్రుడు తుంగా సాయికుమార్‌తో కలిసి కారులో పలుదేవర్లపాడు గ్రామానికి వచ్చారు. ఇరువురి మధ్య వివా దం పెరగటంతో కారులో తిరుగు ప్రయాణమయ్యా రు. అప్పటికే తెల్లవారుజాము కావటంతో వారి వెనకాలే ఘన్‌సైదా బయలుదేరాడు. ఊరు దాటాక గుంటూరు బ్రాంచి కాలువ వద్ద మలుపు ఎక్కే క్రమంలో కారు నేరుగా కాల్వలోకి దూసుకెళ్లింది. వెనకాలే వస్తున్న ఘన్‌సైదా సమాచారాన్ని పోలీసులకు అందించారు. సంఘటనా స్థలానికి చేరిన పోలీసులు కారులో ఉన్న ఇరువురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కారును క్రేన్‌తో స్థానికులు బయటకు తీశారు.

యాలి వాహనంపై నారసింహుడు



గ్రామోత్సవంలో యాలి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నృసింహస్వామి

మంగళగిరి: మంగళగిరి పట్టణంలో వేంచేసివున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి యాలి వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. యాలి వాహన రూఢుడైన స్వామి వారిని దర్శిస్తే దుర్మార్గుల వలన భయం నశిస్తుందని భక్తుల నమ్మకం. యాలి వాహన ఉత్సవానికి నగరానికి చెందిన కీ.శే. మురికిపూడి మాధవరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి పుష్పవేణి కుమారులు కైంకర్యపరులుగా వ్యవహరించగా ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. యాలి వాహనంపై ఆశీనుడైన శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు సాంస్కృతిక కళావేదికపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నేడు సింహవాహనంపై విహరించనున్న స్వామి

బ్రహ్మోత్సవాలలో భాగంగా నరసింహస్వామి శుక్రవారం రాత్రి ఏడు గంటలకు సింహవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారని ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తెలిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

గంజాయి సరఫరా, క్రయ విక్రయాలు చట్టరీత్యా నేరం

అక్రమ కార్యకలాపాలు వృత్తిగా భావించే వారిపై పీడీ చట్టం నమోదు

నగరంపాలెం: గంజాయి సరఫరా, క్రయ విక్రయాలు చట్టరీత్యా నేరమని, ఇటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బుధవారం తెల్లవారుజామున అమరావతిరోడ్, అరండల్‌పేటలో జరిగిన ఇద్దరి వాచ్‌మెన్ల హత్య కేసుల్లో నిందితులైన మైనర్లు కేవలం చోరీలు చేసేందుకు పథకం వేశారని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న వాచ్‌మెన్లపై గడ్డ పలుగుతో దాడికి పాల్పడ్డారని తెలిపారు. గంజాయి మత్తులో ఉన్నారనేది అవాస్తవమని స్పష్టంచేశారు. జిల్లాలో గంజాయి రవాణా, క్రయ విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గతేదాది (2022) జిల్లా వ్యాప్తంగా 104 గంజాయి కేసులు నమోదవ్వగా, 220 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. వారి వద్ద 281 కేజీల గంజాయి, 3.5 లీటర్ల లిక్విడ్ గంజాయి, 25 వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు. వివిధ మార్గాల్లో గంజాయిని తరలించే అక్రమార్కుల సమాచారాన్ని ముందస్తుగా గుర్తించే వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడే వారికి సరైన రీతిలో కౌన్సెలింగ్ చేస్తున్నామని అన్నారు. అక్రమ కార్యకలాపాలను వృత్తిగా భావించే వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పెరుగుతున్న వినికిడి సమస్యలు

నేడు వరల్డ్ హియరింగ్ డే

- ఆధునిక జీవన శైలితో సమస్య తీవ్రతరం
- ముందస్తుగా వినికిడి సమస్యను గుర్తించవచ్చు
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా కాక్లియర్ ఆపరేషన్లు



వినికిడి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

గుంటూరుమెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల యువత వినికిడి సమస్య బారిన పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం పది మందిలో ముగ్గురికి వినికిడి సమస్య ఉంటుంది. వినికిడి సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నివారించవచ్చు. కానీ అనేక మందికి సమస్యపై అవగాహన లేకపోవడం వల్ల ప్రాథమిక దశలో చికిత్స చేయించకుండా చెవిటివారిగా మారి పోతున్నారు. వినికిడి లోపం వల్ల మాటలు రావు. వినికిడి సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా మార్చి 3న వరల్డ్ హియరింగ్‌డే నిర్వహిస్తున్నారు. వినికిడి లోపం రావడానికి కారణాలు, వాటిని ఏవిధంగా నిర్ధారించాలనే విషయాలను వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వినికిడి లోపం కారణాలు

పుట్టుకతో వినికిడి శక్తి లోపానికి ప్రధాన కారణం జన్యుపరమైనవే. పుట్టుకతో 70 శాతం వినికిడి లోపం మేనరికపు వివాహాల వల్ల వస్తుంది. వినికిడిలోపం రావడానికి నవజాత శిశువుగా ఉన్నప్పుడు కామెర్ల వ్యాధి సోకడం, ఆక్సిజన్ లోపం వల్ల వస్తుంది. గర్భంలో బిడ్డ ఉన్నప్పుడు తల్లి సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం, గర్భవతికి ఏమైనా ఇన్‌ఫెక్షన్లు సోకడం వల్ల పుట్టబోయే బిడ్డకు వినికిడి సమస్య వస్తుంది. శబ్ద కాలుష్యం ద్వారా 16 శాతం మందిలో వినికిడి లోపం వస్తుంది. శబ్దాన్ని 140 డెసిబిల్స్ మించి దగ్గరగా విన్నా, 70 డెసిబిల్స్‌పై శబ్దాన్ని ఎక్కువ కాలం విన్నా వినికిడి లోపం వస్తుంది. మన దేశంలో వాహన శబ్ద కాలుష్యం పరిమితి స్థాయి దాటి ఉండటం వల్ల పట్టణాల్లో ఎక్కువ సమయం గడిపేవారు వినికిడి సమస్యకు గురవుతున్నారు. వృద్ధాప్యం వల్ల సర్వసాధారణంగా వినికిడి లోపం వస్తుంది. కొన్ని రకాల మందులు వాడడం వల్ల కూడా వినికిడి లోపం వస్తుంది. సుమారు 200 రకాల ఔషధాలు వినికిడి శక్తిని తగ్గిస్తాయని పరిశోధనలో తేలింది. ముఖ్యంగా క్యాన్సర్, గుండె జబ్బులకు వాడే మందులు వినికిడి శక్తిని తగ్గిస్తాయి. తలకు, లేదా చెవికి బలమైన దెబ్బతలగడం వల్ల చెవి మధ్యలో ఇన్‌ఫెక్షన్ రావడం వల్ల వినికిడి సమస్య వస్తుంది.



రోజుకు ఐదు నుంచి పది మందికి చికిత్స

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 మంది ఆడియాలజిస్టులు ఉన్నారు. వారంలో ఒక్కో ఆడియాలజిస్టు 5 నుండి 10 మంది పిల్లలకు చెవుడు, మూగ సమస్యకు చికిత్స అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు మూడువేల మంది పిల్లలు వినికిడి సమస్యతో బాధపడుతున్నట్లు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ నివేదిక వెల్లడిస్తుంది. వినికిడి శక్తి పరీక్షలను ఆడియాలజీ సెంటర్‌లలో చేస్తారు.

ముందస్తు జాగ్రత్తలు



పెద్ద శబ్దాలు వినడం ద్వారా వినికిడి సమస్య వస్తుంది కాబట్టి వీటికి దూరంగా ఉండాలి. ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని ఎక్కువ సేపు పాటలు వినడం మానేయాలి. చెవిలో పిన్నులు, పుల్లలు, ఇతర వస్తువులు పెట్టుకుని తిప్పుకోకూడదు. ఇయర్ ప్రొటెక్టివ్ డివైజర్స్ వాడాలి. షుగర్ ఉన్నవారు, డిప్రెషన్‌తో బాధపడేవారు తప్పనిసరిగా ఏడాది కొకసారి వినికిడి పరీక్ష చేయించుకోవాలి. చెవి ఇన్‌ఫెక్షన్‌లను త్వరితగతిన తగ్గించుకునేలా వైద్యులను సంప్రదించాలి. ప్రాథమిక దశలో నిర్లక్ష్యం చేస్తే వినికిడి సమస్య ఏర్పడుతుంది.

– ఆర్.శిరీష, ఆడియాలజిస్టు అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజిస్టు, గుంటూరు

ఉచితంగా ఆపరేషన్‌లు



పుట్టుకతో వినికిడి సమస్య ఉన్న పిల్లలకు మూడు నుంచి ఐదేళ్లలోపు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేస్తే ఫలితం ఉంటుంది. దేశంలో మొట్టమొదటిసారిగా ఏపీలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండు చెవులకు కాక్లియర్ ఆపరేషన్లు ఉచితంగా చేసే విధంగా ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారు. సుమారు ఒక్కో చెవికి రూ.8 లక్షలు ఖరీదు చేసే కాక్లియర్ ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారు.

– డాక్టర్ బయ్యా సుధీర్, కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్, గుంటూరు



గుడారాల పండుగను ప్రారంభిస్తున్న పాస్టర్ మోహన్ సి.లాజరస్, బ్రదర్ అబ్రహాం



ప్రార్థనలకు భారీగా తరలివచ్చిన విశ్వాసకులు

భక్తి 'గుడారం'.. స్తుతి నైవేద్యం

గుంటూరు నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో 46వ గుడారాల పండుగ భక్తిశ్రద్ధలతో ప్రారంభం అయ్యింది. గురువారం తమిళనాడుకు చెందిన పాస్టర్ మోహన్ సి. లాజరస్ సభను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, పాస్టర్‌లు ఫ్రెడిపాల్, రాజు, రమేష్, జాన్ వెస్లీ హాజరయ్యారు. పాస్టర్ జాన్‌వెస్లీ వాక్యసందేశం అందిస్తూ ఏసుక్రీస్తు యదార్థవంతుడు, న్యాయమంతుడని అన్నారు. భయభక్తులు కలిగిన వారికి ఆయన కృప ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయనను నమ్మినవారికి సంక్షేమాభివృద్ధి, ఆరోగ్యాభివృద్ధి, విజయాభివృద్ధి కలుగుతుందని వివరించారు. ఆదివారం మధ్యాహ్నం వరకూ ఈ పండుగలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. – గుంటూరు రూరల్

సీఎం చిత్రపటానికి
రాజధాని వలంటీర్ల క్షీరాభిషేకం



తాడేపల్లిరూరల్: రాజధాని పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు ఆనందంలో మునిగి తేలుతున్నారు. రాజధాని పెన్షన్‌ను ప్రభుత్వం పునరుద్ధరించడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంటీఎంసీ పరిధిలోని 30 మంది వలంటీర్లకు గురువారం పెన్షన్‌లు అందాయి. ఈ సందర్భంగా వలంటీర్లు పెనుమాక సచివాలయం వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ తొలుత వలంటీర్లందరికీ పెన్షన్లు నిలిపివేయడంతో మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లామని, స్పందించిన ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారని, వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి ఫిబ్రవరి నెల నుంచి రాజధాని పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లందరికీ రైతు కూలీ పెన్షన్ అందజేయాలని ఆదేశించారన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ పెనుమాక కన్వీనర్ మేకా దామేష్ రెడ్డి, అన్నూరి సుబ్బారావు, పులి భుజంగరావు, మేకా వెంకట శివారెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వసతుల పిచ్‌పై అభివృద్ధి పరుగులు

- పురోగతిలో జిల్లా క్రికెట్ అసోసియేషన్
- సౌత్‌జోన్ అండర్–14 రాష్ట్ర జట్టులో రాణిస్తున్న జిల్లా క్రికెటర్లు
- పిచ్చుకల గుంట మైదానంలో మెరుగైన వసతులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో గుంటూరు జిల్లా క్రికెట్ సంఘం పనితీరు గణనీయంగా మెరుగయింది. జిల్లా జట్టు సైతం అద్భుత విజయాలు నమోదు చేస్తుంది. ముఖ్యంగా ఏసీఏకు అధ్యక్షుడిగా శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శిగా గోపీనాథ్‌రెడ్డి, సీఈఓగా శివారెడ్డిలు బాధ్యతలు చేపట్టిన తర్వాత క్రీడలో జిల్లా మరింతగా పురోగమిస్తుందని క్రికెటర్లు చెబుతున్నారు.

ఆంధ్ర జట్టులో కీలకంగా జిల్లా క్రీడాకారులు ..

జనవరి 27 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరిగిన కేరళలో జరిగిన బీసీసీఐ ఆల్ ఇండియా సౌత్‌జోన్ అండర్–14 బాలుర క్రికెట్ చాంపియన్‌షిప్‌ను ఐదేళ్ల తర్వాత గెలుచుకుంది. ఆంధ్రతో కలిపి హైదరాబాద్, గోవా, కేరళ, పాండిచ్చేరి, కర్నాటక, తమిళనాడు మొత్తం ఏడు రాష్ట్రాలు తలపడ్డ ఈ టోర్నీలో ఆంధ్ర జట్టు ఆద్యంతం ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ జట్టుకి గుంటూరుకు చెందిన జి.దేవ్ ప్రమోద్ కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును ముందుండి నడిపించడమే కాకుండా ఒక సెంచరీపాటు, 251 పరుగులు చేసి విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అదేవిధంగా మరో క్రీడాకారుడు అబ్దుల్ జబ్బార్ ఆల్‌రౌండర్‌గా రాణించాడు. టోర్నీ మొత్తంలో 19 వికెట్లు తీసి, 120 పరుగులు చేసి జట్టు విజయాల్లో ముఖ్యభూమిక పోషించాడు. గుంటూరుకే చెందిన రషీద్



సౌత్ జోన్ విజేతగా నిలిచిన ఆంధ్ర అండర్ -14 జట్టు (ఫైల్)



పిచ్చుకులగుంట క్రికెట్ మైదానం

ఇటీవల ఐపీఎల్‌కు ఎంపికైన సంగతి తెలిసిందే. మహీప్, వంశీలాంటి యువ క్రికెటర్లు ఇప్పటికే రంజీల్లో రాణిస్తుండగా, మరికొంత మంది యువ క్రికెటర్లు అద్భుతాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

మారుతున్న పిచ్చుకల గుంట రూపురేఖలు..

గతేడాది ఏసీఏ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రతి జిల్లాకు అద్భుతమైన క్రికెట్ మైదానం, నెట్స్, కోచెస్, సదుపాయాలు కల్పిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకల గుంట మైదానం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గతంలో ఒకే ఒక టర్ఫ్ వికెట్ ఉండేది. ఇప్పుడు అవి ఆరుకు చేరాయి. దీంతోపాటు సిమెంట్ ప్రాక్టిస్ వికెట్స్ అభివృద్ధి చేశారు. జిమ్, ప్లేయర్స్‌కు రూమ్స్, మైదానాన్ని శుభ్రం చేసేందుకు సొంతంగా రెండు రోలర్ వెహికల్స్, మరుగుదొడ్ల ఏర్పాటు ఇలా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారు.

సునాయాసంగా సెంచరీలు



ఇటీవల జరిగిన జోనల్ మ్యాచెస్‌లో నా కాన్ఫిడెంట్ బాగా పెరిగింది. ఒకప్పుడు సెంచరీ అంటే అత్యంత కష్టంగా ఉండేది. ఇప్పుడు అంతా మారిపోయింది. సులభంగా ఆడగలుగుతున్నాను. మా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ప్రోత్సాహాన్ని నేను మరువలేను.

– రోనీ అమోల్, బ్యాట్స్‌మెన్, అండర్–16 రాష్ట్ర జట్టు సభ్యుడు

త్వరలో ఫ్లడ్ లైట్స్..



పిచ్చుకల గుంట మైదానాన్ని చాలా వరకు మార్పు చేశాం. ముఖ్యంగా రంజీ ప్లేయర్స్ ఆడే విధంగా టర్ఫ్ వికెట్స్ తయారు చేయించాం. వారి కోసం త్వరలో ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేస్తున్నాం. చక్కని సదుపాయాలు, ఉచిత శిక్షణ పేద విద్యార్థులు కూడా రాణించే వీలు కల్పించాం. ఏసీఏ పూర్తి సహాయ సహకారాలందిస్తుంది. యువకుల్లో ప్రతిభను వెలికితీసేందుకు నూతన విధానాలు అమలు చేస్తున్నాం. జిల్లా అధ్యక్షుడు ఎంఎస్‌పీ రమణమూర్తి, సభ్యులతో కలిసి అభివృద్ధి చేస్తున్నాం.

– దాసరి రమేష్ కుమార్, కార్యదర్శి, జిల్లా క్రికెట్ అసోసియేషన్

ఉత్తమ కోచింగ్ కారణంగానే విజయాలు..



ఇక్కడ కోచింగ్‌తోపాటు క్రమశిక్షణ, ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యతనిస్తారు. మేము సౌత్‌జోన్‌కు ఆడినప్పుడు ఎక్కడా కూడా భయపడలేదు, గాయపడలేదు. అందుకే విజేతలుగా నిలిచాం. ఆ టోర్నీలో నేను ఒక సెంచరీతో పాటు మొత్తం 251 పరుగులు చేశాను. ముఖ్యంగా కోచింగ్, వసతులు చాలా బాగున్నాయి.

– జి.దేవ్ ప్రమోద్, కెప్టెన్ అండర్–14 రాష్ట్ర జట్టు

ఆల్‌రౌండర్‌గా రాణించాను



సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌లో నేను 19 వికెట్లు తీయడంతోపాటు 120 పరుగులు చేసి జట్టు విజయాల్లో కీలక భూమిక పోషించాను. కోచింగ్ పూర్తిగా ఉచితం. గతం లోకంటే ఎంతో ఇక్కడ వసతులు మెరుగయ్యాయి. అందుకే ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాను. ఇక్కడ నేర్చుకునేందుకు ఎంతో ఉంది.

– అబ్దుల్ జబ్బార్, అండర్–14 రాష్ట్ర జట్టు ఆల్‌రౌండర్

అద్భుతమైన శిక్షణ..



నా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం బాగుంది. ఇక్కడకు వచ్చిన నా పేరెంట్స్ వసతులు చూసి చేర్పించారు. బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ రాణిస్తున్నాను. మా లోపాలను ఎప్పటికప్పుడు సరిచేస్తూ మమ్మల్ని ట్రైన్ చేస్తున్నారు. అద్భుతమైన టర్ఫ్ వికెట్లు అందుబాటులో ఉన్నాయి.

– డి.హర్షవర్ధన్, అండర్–16 రాష్ట్ర క్రీడాకారుడు

గణేష్ మహల్‌ను బీఫాం లైసెన్స్ లేకుండా నడుపుతున్నారు

జేసీ రాజకుమారికి ఫిర్యాదు చేసిన హేమలత, రమాదేవిలు

గుంటూరు వెస్ట్: బీఫాం లైసెన్స్ లేకుండా స్థానిక కొత్తపేటలోని గణేష్ మహల్ (పాత లీలామహల్) థియేటర్‌ను దొడ్డా వెంకట సత్యనారాయణ వరప్రసాద్ నడుపుతున్నారని సముద్రాల హేమలత, దొడ్డా రమాదేవిలు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. థియేటర్‌కున్న బిఫాం లైసెన్స్ గత ఏడాది నవంబర్‌లోనే ముగిసిపోయిందని అయినా థియేటర్ అక్రమంగా రన్ చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి దొడ్డా వెంకట సత్యనారాయణ వరప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. తదుపరి చర్యలకు కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె పేర్కొన్నారు. దీనిపై జేసీ బి.రాజకుమారిని 'సాక్షి' వివరణ కోరగా కుటుంబసభ్యుల మధ్య విబేధాలు ఉన్నాయని, దానికి వారసులు ఎవరో తేల్చుకుని వస్తే బీఫాం లైసెన్స్ పునరుద్ధరిస్తామని తెలిపారు.

చిన్నారిపై కుక్కల దాడి

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



గాయాలతో హషీదా

గుంటూరు ఈస్ట్: లాం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని, షేక్ ఆలియా దంపతుల రెండు సంవత్సరాల కుమార్తె హషీదాను గురువారం జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం ఇంటి ముందు ఆడుకుంటున్న తమ కుమార్తెపై శునకాలు దాడిచేశాయని చెప్పారు. గాయపడిన తమ కుమార్తెకు అదేరోజు జీజీహెచ్‌లో మొదటి డోసు ఇంజక్షన్ వేయించామన్నారు. రెండో డోసు ఇంజక్షన్ వేయించేందుకు గురువారం జీజీహెచ్‌కు వచ్చామన్నారు. తమ కుమార్తెపై శునకాలు దాడిచేసిన విషయాన్ని లాం గ్రామ పంచాయతీ అధికారులకు తెలియజేశామని, వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తమ కుమార్తె మొఖం, చేతులు, వీపుపై పలు చోట్ల కుక్కలు తీవ్రంగా కరిచాయని వివరించారు.

ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో గృహప్రవేశాలు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం నిర్మిస్తున్న జగనన్న గృహ సముదాయాల్లోని ఇళ్లు ఉగాది నాటికి పూర్తయి, గృహప్రవేశాలు జరిపేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22 తెలుగు సంవత్సరాది నాడు అధిక సంఖ్యలో ప్రారంభోత్స వాలుంటాయన్నారు. ఇప్పటికే దాదాపు పూర్తయిన గృహాలకు విద్యుత్ కనెక్షన్, మంచినీటి సదుపాయం, రోడ్లు అభివృద్ధి తదితర కార్యక్రమాలు పూర్తికావచ్చాయని చెప్పారు. గ్రామాల్లో భూముల రీ సర్వే ప్రక్రియ వేగంగా జరుగుతుందన్నారు. గ్రామ కంఠ భూములకు సైతం రీ సర్వే చేశామని చెప్పారు. త్వరలోనే కొన్ని పట్టాలు కూడా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద అర్హులైన రైతుల నుంచి ఆర్బీకేల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. మైక్రో డ్రిప్ ఇరిగేషన్‌తో నీటి వినియోగం తగ్గించి పంట పొలాలకు నలుమూలల నీరందించే ప్రక్రియకు డిమాండ్ పెరుగుతుందన్నారు. జగనన్న పాల వెల్లువ పథకాన్ని గ్రామ గ్రామాలకు విస్తరిస్తున్నామని, రైతులకు బ్యాంకు రుణాల ద్వారా గేదెలను సమకూర్చుకునే విధంగా ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జేసీ జి.రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివ రామిరెడ్డి, జడ్పీ సీఈఓ మోహన్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

చోరీలకు పాల్పడిన నిందితుడు అరెస్టు

పట్నంబజారు: గుంటూరు నగరంలో ఓ నివాసంలో భారీ చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో గురువారం ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ బి.సీతారామయ్య, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ ఎం.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం యాదగిరి గుట్టమండలం యాదగిరిపల్లెకు చెందిన కళ్లెం రవికుమార్ అలియాస్ పత్తి రవి అలియాస్ ఆర్కే చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈక్రమంలో తెలంగాణ రాష్ట్రంలో సైతం పలు చోరీలకు పాల్పడ్డాడు. అనంతరం గుంటూరు జిల్లా పెదకాకానిలోని అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉంటూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేయడం ప్రారంభించాడు. ఈక్రమంలో గతనెల 6వ తేదీ తిరుపతి వెళ్లిన గుంటూరు చౌత్రాసెంటర్, పెద్ద మసీదు ప్రాంతానికి చెందిన నూకల మురళీకృష్ణ నివాసంలో చోరీకి పాల్పడ్డాడు. ఇంట్లో ఉన్న బీరువాలోని బంగారాన్ని దోచుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి ఆచూకీ కోసం యత్నించగా, గురువారం గుంటూరు చౌత్రా సెంటర్‌లో దొంగిలించిన బంగారం విక్రయించేందుకు వచ్చినట్లు గుర్తించి, పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో చోరీకి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించారు. నిందితుడి వద్ద 373 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐలు ఆర్.ఎం.విజయ్‌కుమార్, కె.అమర్‌వర్ధన్, కానిస్టేబుళ్లు నాగూర్‌వలి, రవి, సుబ్బారావు, కిరణ్‌లను అభినందించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సీతారామయ్య, ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు, ముసుగులో నిందితుడు

డిజిటల్ గ్రంథాలయాల సృష్టికర్త ముఖ్యమంత్రి

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని 11,950 గ్రంథాలయాల ఆధునికీకరణకు నాంది పలికిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ గ్రంథాలయాల సృష్టికర్తగా నిలిచారని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో చంద్రబాబు గ్రంథాలయాలను నిర్వీర్యం చేసి, తీరని ద్రోహం చేశారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో గ్రంథాలయాలకు జీవం పోశారన్నారు. గ్రంథాలయాలను సమాజానికి మరింతగా చేరువ చేస్తూ గత ఏడు నెలలుగా 'మనము–మన గ్రంథాలయం' పేరుతో ప్రతినెలా మొదటి శనివారం ప్రత్యేకంగా గ్రంథాలయాలను పరిశుభ్రం చేసే చేపట్టిన కార్యక్రమం ఇప్పటి వరకు రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో విజయవంతంగా నిర్వహించామని, తాజాగా ఈనెల 5వ తేదీన గుంటూరు నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ సెస్సు బకాయిల వసూళ్లకు ముఖ్యమంత్రి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. గుంటూరు జిల్లాలో రూ.50 కోట్ల మేరకు పేరుకుపోయిన సెస్సు బకాయిల్లో రూ.15 కోట్లు వసూలు చేశామని చెప్పారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి, ఉద్యోగులు సీతారామయ్య, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మనము-మన గ్రంథాలయం పోస్టర్ ఆవిష్కరిస్తున్న శేషగిరిరావు, దేవానంద్, ఝాన్సీలక్ష్మి